
ప్రజాశక్తి

శుక్రవారం 16 మే 2025

5

పార్వతీపురం మన్యం



జిల్లాలో 16 టైలరింగ్ శిక్షణా కేంద్రాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో 16 టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో కేంద్రంలో 144 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉందన్నారు. శిక్షణ కేంద్రాలను ఎంపిడిఒలు తనిఖీ చేసి, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు. సిసిఆర్‌సి కార్డులు డ్రైవ్ మోడ్‌లో జారీ చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుండి కూడా రుణాలు పొందవచ్చని చెప్పారు. రైతుల ఆధార్ కార్డుల మిస్ మ్యాచ్ ఉంటే వాటిని సరి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శోబిక, ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ హేమలత, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ పాల్గొన్నారు.

ఊరి బడికి ఉరి



కురుపాం-1 ప్రాథమిక పాఠశాల

ఆదర్శ పాఠశాల పేరిట టిడిపి కూటమి సర్కారు అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై క్షేత్రస్థాయిలో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఊరి బడికే తమ పిల్లల్ని దూరం చేసే ఈ ప్రక్రియను ఎంత మాత్రమూ ఒప్పుకోబోమని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడంతో పాటు ఊరి బడికి ఉరి వేసి గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆ జిఒను తలదన్నేలా మోడల్ స్కూల్స్ పేరిట బడులను విలీనం చేస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతపడేటట్లు చేస్తోంది.


- విలీనంపై పెరుగుతున్న వ్యతిరేకత
- ఏకపక్ష తీర్మానాలకు ఎంఇఒల ఒత్తిడి

ప్రజాశక్తి - కురుపాం

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు దూకుడును పెంచింది. విలీన ప్రక్రియ కార్యక్రమ బాధ్యతను ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులపై పెట్టారు. 'ఏమైనా చేసుకోండి.. బుజ్జగించండి .. బతిమలాడండి... అంతిమంగా తల్లిదండ్రులను ఒప్పించి విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసి పంపాలి' అంటూ ఎంఇఒలు ఆదేశాలు జారీ చేస్తున్న పరిస్థితి. ఆ మేరకు మండల పరిధిలో విలీన ప్రక్రియ జాబితాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధిత ఎంఇఒల నుంచి ఎస్ఎంసి తీర్మాన పత్రాలు పంపాలని ఆదేశాలు వెళ్లడం గమనార్హం.

దళిత, గిరిజనులు చదువుకు దూరం

టిడిపి కూటమి సర్కారు అమలు చేస్తున్న పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా దళిత, గిరిజనులు, పేదలు చదువుకు దూరం కానున్నారు. గిరిజన గ్రామాలు ఊరికి దూరంగా ఉండే నేపథ్యంలో ఎక్కడో ఉన్న ఉన్నత పాఠశాలలకు పేద పిల్లలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధిక శాతం పేదలు, దళిత, గిరిజనులే. ఈ నేపథ్యంలో విలీన ప్రక్రియ కారణంగా వారంతా ఉన్నత చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు ఎస్ఎంసి సమావేశాల సందర్భంగా పాఠశాల విలీన ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఊరు బడికి ఉరియాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. అలా కాదని ముందుకెళ్తామంటే పిల్లల్ని బడికి కూడా పంపబోమని తెగేసి చెబుతున్నారు. తల్లిదండ్రులకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల నుంచి మద్దతు లభిస్తుండటంతో విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా ఎంఇఒ కార్యాలయాలకు తీర్మానాలు వెళ్తున్నాయి.



తమ పిల్లలకు చదువు దూరం చేయొద్దని ఎంఇఒ సత్యనారాయణకి వినతి అందజేస్తున్న కురుపాం గౌడవీధి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు(ఫైల్)

వ్యతిరేకంగా తల్లిదండ్రుల తీర్మానాలు

- పెదగొత్తిలి ప్రాథమికోన్నత, నీలకంఠాపురం ప్రాథమిక పాఠశాలలను మొండెంఖల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, కిచ్చాడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను కురుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, గుంజరాడ ప్రాథమికోన్నత పాఠశాలను మొండెంఖల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రులు తీర్మానించారు.
- కురుపాం గౌడువీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 3, 4, 5 తరగతులను కురుపాం-1 ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం వల్ల ప్రధాన రహదారి మీదుగా పిల్లలు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతిరోజూ పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లలేమని, ఆ పాఠశాలలో విలీనం చేస్తే తమ పిల్లల్ని బడికి పంపబోమంటూ తల్లిదండ్రులు ఎంఇఒ ఎన్.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.
- లంక జోడు, డి.భారామణి, బియ్యాలవలస, పొడి, నడిమి కొత్తగూడ, తదితర గ్రామాల్లో పాఠశాలల విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టారు.
- ప్రభుత్వ పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా ఇప్పటికే ప్రజా సంఘాల ఐక్యవేదిక పోరుబాట పట్టిన నేపథ్యంలో సర్కారు మొండిగా ముందుకు వెళ్తుందా? లేకుంటే వెనక్కి తగ్గుతుందో వేచి చూడాల్సి ఉంది.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లకు

రేషన్ కార్డులు ఇవ్వాలి

నెట్‌వర్క్ సమస్యలను తొలగించాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్‌వర్కర్లకు రేషన్ కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలు వర్తించేటట్లు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో మూడు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పలు రకాల సేవలందిస్తున్నారని తెలిపారు. వీరి కుటుంబసభ్యులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, ఇళ్ల స్థలాలు వంటి పథకాలు వర్తింపజేయడం లేదని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ సరుకులతో పాటు సంక్షేమ పథకాలు ఇవ్వాలని నాటి వైసిపి ప్రభుత్వాన్ని అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించడాన్ని గుర్తుచేశారు. కొత్త రేషన్ కార్డులు, చేర్పులు, మార్పుల కోసం సచివాలయాలకు వెళ్తున్న లబ్ధిదారులకు ఎటువంటి ఊరట లభించడం లేదన్నారు. మహిళలు, బాలింతలు పడిగాపులు కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. నెట్‌వర్క్ సమస్యల వల్ల వారం మొత్తానికి కనీసం ఒక కుటుంబం కూడా లబ్ధిపొందే పరిస్థితి లేదన్నారు. లబ్ధిదారులు కొత్త రేషన్ కార్డు పొందేందుకు ప్రభుత్వం విధించిన పది రకాల పరిమితులకు లోబడి ఉండాలనడం చాలా అన్యాయమని మండిపడ్డారు. తక్కువ ఆదాయం పొందుతున్న నిరుపేద కుటుంబాలు అత్యధిక స్థాయిలో ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. తక్కువ వేతనం, తక్కువ ఆస్తి కలిగిన వారు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించరాదని ప్రభుత్వమే చెబుతున్నప్పటికీ విద్యుత్ వినియోగం, భవనాలు, వాహనాలు, భూములు ఇలా సాధారణ రీతిలో సామాన్య కుటుంబాలు సమకూర్చుకునే సౌకర్యాలను కూడా కారణంగా చూపి ప్రభుత్వ రేషన్ కార్డులకు, సంక్షేమ పథకాలకు అనర్హులుగా గుర్తించడం దారుణమన్నారు. దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ఆర్థిక మాంద్యం పెరుగుతున్న తరుణంలో, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకపోవడంతో పోషణ కష్టంగా మారుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి, గత ఎన్నికల్లో వాగ్దానం మేరకు నూతన రేషన్ కార్డులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పథకాలన్నీ వర్తించేటట్లు, నెట్‌వర్క్ సమస్యలను తొలగించేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం విధించిన పరిమితుల స్థాయిని పెంచాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

గ్రామకంఠం భూములకు రక్షణ కల్పించాలని

మాజీ సైనిక ఉద్యోగి నిరవధిక దీక్ష

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో కొండాపురం గ్రామంలో గ్రామకంఠం భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ సైనిక ఉద్యోగి కరణం మురళి గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. గ్రామంలో గ్రామకంఠం భూములను కొంతమంది ఆక్రమించుకున్నారని ఆయన తెలిపారు. ఆ భూములను నిజమైన పేదలకు పంచి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై మరోసారి అధికారులు సర్వే చేయాలన్నారు



నిరవధిక దీక్ష చేస్తున్న మురళి

పిఎం జన్‌మన్‌కు ప్రాధాన్యత

ప్రజాశక్తి-పార్వతీపురం

పిఎం జన్‌మన్ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్‌మన్ కార్యక్రమం కింద జిల్లాలో 5,853 గృహాలను గిరిజనులకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో ఇంకా 2,967 గృహాల నిర్మాణం ప్రారంభం కాకపోవడాన్ని కలెక్టర్ ప్రశ్నించారు. వారం రోజుల్లో నిర్మాణం ప్రారంభం కావాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన గృహాల నిర్మాణాలు వేగవంతం కావాలని స్పష్టం చేశారు. ఇతర పథకాల కింద మంజూరైన గృహాలు త్వరగా పూర్తి చేయుటకు ప్రభుత్వం అదనపు నిధులను విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 3,618 మందికి అదనపు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. పార్వతీపురం, సాలూరు, మక్కువ, కొమరాడ తదితర అధిక పెండింగ్‌లో ఉన్న మండలాల అధికారులు వేగవంతంగా ప్రగతిని చూపించాలని ఆదేశించారు. ప్రగతి చూపించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర

మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. 'బీట్ ద హీట్' థీమ్ తో నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్ర శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎన్.కృష్ణ వేణి, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా ఖజానా అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డెంగీ వ్యాధి మనిషి నుంచి మనిషికి ఏడిస్ ఈజిప్ట్ దోమల ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు. దీన్నే టైగర్ దోమ అని కూడా పిలుస్తారని తెలిపారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటాయని, పగటిపూట మాత్రమే కుడతాయని చెప్పారు. ఈ దోమ మంచినీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుందని చెప్పారు. త్వరితగతిన ఎక్కువ మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో గతేడాది 123 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 4 కేసులు నమోదైనట్లు గుర్తుచేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎన్ఎస్‌వన్ రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్షలు చేస్తారని తెలిపారు. డెంగీ వ్యాధి వచ్చిన తదుపరి చికిత్స తీసుకోవడం కంటే ముందే నివారణ చర్యలు చేపట్టడం మంచిదని పేర్కొన్నారు. దిగువున తెలిపిన నివారణ చర్యలు ప్రతిఒక్కరూ తీసుకోవాలని ఆయన సూచించారు.

- ఇంటిలోపల, ఆవరణలో ఎక్కడా మూతలేకుండా కొద్దిగా కూడా నీరు నిల్వ ఉంచకూడదు.
- వారానికి ఒకసారి అన్ని నీటి నిల్వలను పారపోసి, పాత్రలను శుభ్రంగా తుడిచి పెట్టుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి.
- ఇంటిలో లేదా ఆవరణలో మస్కిటోరిపెల్లెంట్ మొక్కలు.. బంతి, పుదీనా మొదలైన మొక్కలను పెంచుకోవాలి.
- డెంగీ అని అనుమానం వచ్చిన వెంటనే పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలి.
- దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.



త్రీమెన్ కమిటీ నియామకంలో

జాప్యమెందుకో..?

- ఆరు నెలలుగా ఊరిస్తున్న మంత్రి
- ఆశావహ నాయకుల్లో అసంతృప్తి
- ప్రత్యేకాధికారి ఏలుబడిలో సాలూరు అర్బన్ బ్యాంకు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఉన్న ఏకైక అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుకు త్రీమెన్ కమిటీ నియామకంలో జాప్యమెందుకో అంతుచిక్కడం లేదు. సుమారు ఏడాది కాలంగా బ్యాంకు ప్రత్యేకాధికారి ఏలుబడిలో కొనసాగుతోంది. 2021 మే నెలతో బ్యాంకుకు ఎన్నికైన పాలకవర్గం గడువు ముగిసింది. ఆ తర్వాత కొన్నాళ్లకు వైసిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే సిఫార్సు మేరకు ప్రభుత్వం కొత్త పాలక వర్గాన్ని ఎంపిక చేసింది. సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు చైర్మన్‌గా 2024 జూన్ వరకు నామినేటెడ్ పాలకవర్గం కొనసాగింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. అర్బన్ బ్యాంకు ఎన్నికల నిర్వహణకు ఏవిధమైన చర్యలూ తీసుకోవడం లేదు. ఎన్నికైన పాలకవర్గం ఉంటే బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. బ్యాంకు ప్రగతి పథంలో ముందుకెళ్లడానికి అవకాశం లభిస్తుంది. ప్రత్యేకాధికారి పాలన బ్యాంకు అభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతుంది. ఈ కారణంతో బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనందున ప్రభుత్వం చేత త్రీ మెన్ కమిటీ నియమించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆరు నెలల క్రితం ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినా ఆచరణలోకి రాకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ నడుస్తోంది.

కొలిక్కి వచ్చినా..?

గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సంధ్యారాణికి పట్టణంలో అనూహ్యమైన ఆధిక్యత లభించింది. పట్టణ నాయకులు, కార్యకర్తలు ఆమె గెలుపు కోసం కృషి చేశారు. ఆమె ఎన్నికై ఏడాది కావస్తోంది. ఆరు నెలల క్రితం అర్బన్ బ్యాంకుకు త్రీమెన్ కమిటీ నియామకంపై ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ కమిటీలో ఎవరెవరిని నియమించాలనే దానిపై మంత్రి సంధ్యారాణితో నాయకులు చర్చించారు. అందరి ఆమోదంతో ముగ్గురు పట్టణ నాయకులను త్రీ మెన్ కమిటీకి ఎంపిక చేశారు. పట్టణంలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కూనిశెట్టి భీమారావు, మాజీ వైస్ చైర్మన్ పప్పల మోహన్ రావు, మాజీ డైరెక్టర్ అక్కేన ప్రసాదరావును త్రీ మెన్ కమిటీకి సిఫార్సు చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. మంత్రి సంధ్యారాణికి కూడా సుముఖత వ్యక్తం చేశారు. ఇదంతా జరిగి ఆరు నెలలు కావస్తోంది. ఈ ముగ్గురు నాయకుల పేర్లను సిఫార్సు చేస్తూ మంత్రి సంధ్యారాణి లేఖను ప్రభుత్వానికి పంపించాలి. అయితే ఆమె ఇంతవరకు సిఫార్సు లేఖని ఆశావహ నాయకులకు గాని, ప్రభుత్వానికి గాని అందజేసిన దాఖలాలు లేవు.

కాలయాపన వెనుక వ్యూహం?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనేక నామినేటెడ్ పదవులకు పార్టీ నాయకులను ఎంపిక చేసింది. మంత్రి సంధ్యారాణి ఇటీవల ఎఎంసి చైర్మన్‌గా తన విధేయుడైన పాచిపెంట మండల నాయకుడు ముఖి సూర్యనారాయణని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయించారు. అదే మాదిరిగా అర్బన్ బ్యాంకు త్రీ మెన్ కమిటీ నియామకంపై మంత్రి సంధ్యారాణి చొరవ తీసుకుని ప్రక్రియ పూర్తి చేయిస్తారనే ఆశతో స్థానిక ఆశావహ నాయకులు ఉన్నారు. ఆరు నెలలు కావస్తున్నా దీనిపై స్పష్టత రాకపోవడంతో ఆశావహ నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. త్రీ మెన్ కమిటీ సిఫార్సు లేఖని ఆశావహ నాయకులకు అందజేసి ప్రక్రియ చేయించుకోవాలని మంత్రి సంధ్యారాణి చెప్పాల్సిన అవసరం ఉంది. లేదంటే ఆమె నేరుగా సిఫార్సు లేఖని ప్రభుత్వానికి పంపించి ప్రక్రియ జరిగేలా బాధ్యత వహించాలి. కానీ ఏదీ జరగకుండా కాలయాపన చేయడం వెనుక వ్యూహం ఏమైనా ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్య సాధన దిశగా కృషి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రాథమిక రంగాల అధికారులను ఆదేశించారు. ప్రతి ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక రంగాల వృద్ధిపై కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాల దిగుబడి గతేడాది కంటే ఈ ఏడాది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పాల ఉత్పత్తి కేంద్రాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలన్నారు. గోశాల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. జిల్లాలో మత్స్య సంపద మరింత పెరగాల్సి ఉందని, వచ్చే ఏడాది మార్చికి 150 లక్షల ఫ్లింగరింగ్ ఫిష్ లక్ష్యం కావాలని, అందుకు అందుబాటులో ఉన్న ట్యాంకులను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 25,410 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరిగి 21 శాతం వృద్ధిని సాధించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా జరుగుతుందని, సేంద్రియ పంటల రైతులను ప్రోత్సహించాలని అన్నారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జీడి, పసుపు, పైనాపిల్, పామాయిల్, ఇతర అంతర్ పంటలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. పశు సంవర్థక శాఖ ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం యూనిట్లను ప్రోత్సహించి జీవనోపాధులు మరింత పెంచాలన్నారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశుసంవర్థక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, టి.సంతోష్‌కుమార్, ఎ.వి.సాల్మన్‌రాజు, ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సుధారాణి, కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సైనికులకు మద్దతుగా నేడు ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సైనికులకు మద్దతుగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మన సైనికులకు సంఘీభావంగా పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా చేపట్టే ఈ ర్యాలీలో వ్యాపారవేత్తలు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువత, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మనందరం చేసే కార్యక్రమం భవిష్యత్తు తరాలకు ఆదర్శం కావాలని పేర్కొన్నారు. సమావేశంలో పరిశీలకులు బొడ్డు పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మక్కువ మండల సమావేశం

ప్రజాశక్తి-మక్కువ

మక్కువ మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.



ట్రెయినీ ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ట్రెయినీ ఎస్ఐలతో ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

విధి నిర్వహణలో పోలీసు అధికారులు నిర్భయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 38 మంది ప్రొబేషనరీ ఎస్ఐలను జిల్లాకు కేటాయించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారు ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వివరాలు, ఏమి చదువుకున్నారు, శిక్షణ గురించి ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు వారికి పోలీస్ స్టేషన్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

అమ్మ బాబోయ్.. మున్సిపాలిటీ పనులా?

- అభివృద్ధి పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- గత పది నెలలుగా రూ.1. 29 కోట్లు పెండింగ్
- బడ్జెట్ సమావేశాలు నిర్వహించకపోవడమే ప్రధాన కారణం
- అమ్మవారి పండగలోపు రోడ్ల మరమ్మతులు చేపట్టడంపై అనుమానాలు



సినిమాను తిరిగే రోడ్డు పరిస్థితి ఇదీ



ఇటీవల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర (ఫైల్)

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో ఉన్న మున్సిపాలిటీలో గత ఏడాది మే నెల నుంచి ఈ ఏడాది మార్చి వరకు కాంట్రాక్టర్లకు, సచివాలయాల అద్దెలు, ఇంజనీరింగ్ ప్రజారోగ్య విభాగాల వాహనాల ఆయిల్ బిల్లులు, విద్యుత్ బిల్లులు మొత్తం రూ.1.29 కోట్లు బిల్లులు చెల్లించలేదు. ఇందులో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలే సుమారు రూ.40 లక్షలు వరకూ ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాలకు సంబంధించిన అన్ని రకాల బిల్లుల బకాయిలే సుమారు 15 లక్షల రూపాయలు వరకు ఉన్నాయి.

ఇటీవల మున్సిపల్ పరిధిలో ఉన్న 5,6 వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ టెండర్ల ద్వారా కొంత మంది కాంట్రాక్టు దక్కించుకున్నారు. ఈ కాంట్రాక్టర్లతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడి ఏప్రిల్ 4వ తేదీన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రతో ఆదరాబాదరాగా అభివద్ధి పనులు ప్రారంభించేందుకు కొబ్బరికాయలు కొట్టించారు. ఇది జరిగి ఆరు వారాలు గడిచినప్పటికీ ఆ పనులను ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో పలు వార్డులలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీనికి ముఖ్య కారణం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు జరగకపోవడమేనని చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో బడ్జెట్ సమావేశం జరగాల్సి ఉండగా ఇంతవరకు జరగకపోవడంతో సచివాలయాల అద్దెలు, వాహనాల ఆయిల్ బిల్లులు, పరిపాలన విభాగానికి సంబంధించిన ఖర్చుల బిల్లులు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించిన మోటార్ల మరమ్మత్తులు, వాహనాల మరమ్మతుల బిల్లులు లక్షలాది రూపాయల బిల్లుల చెల్లింపులు జరగక ఎక్కడివక్కడే ఆగిపోయాయి. దీనికి తోడు మున్సిపల్ సాధారణ సమావేశాలు కూడా మూడు నెలలుగా జరగడం లేదు. దీని కారణంగా అభివృద్ధి పనులు చేపడితే తమకు కూడా బిల్లులు చెల్లింపులు జరుగుతాయో లేదో అని భయంతో సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు.

పండగలోపైనా..?

పార్వతీపురం పట్టణంలో ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ, అమ్మవార్ల పండగ వచ్చేనెల 1, 2, 3వ తేదీలలో జరగనున్నాయి. జూన్ 3వ తేదీన రెండు అమ్మవార్ల జాతర, 2 సిరిమానోత్సవాలు జరగనున్నాయి. ఈ పండగలను తిలకించేందుకు పార్వతీపురం పట్టణంలోని 70 వేల మంది ప్రజలే కాకుండా, పట్టణానికి సంబంధించి దూర ప్రాంతంలో ఉన్న వేలాదిమంది స్థానికులతోపాటు, ఆడపడుచులు, బంధువులు, పరిసర గ్రామాల ప్రజలు.. ఇలా లక్షలాది మంది పట్టణానికి తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ అమ్మవార్ల జాతర సిరిమానోత్సవం తిరిగే ప్రాంతాలలో పలు రోడ్లు, కల్వర్టులు, మరమ్మతులకు గురయ్యాయి. ఇంతవరకు మున్సిపల్ అధికారులు గానీ, స్థానిక పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ వాటి వైపు చూసే దాఖలాలు లేవు. ఇటీవల ఈ పనులు చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు రూ.8 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ ఈ పండగ లోపైనా అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు వస్తారో? లేదో? అని అనుమానం వ్యక్తం అవుతుంది. పండగలోపైనా అభివృద్ధి పనులు జరగవచ్చు అనే ఆశతో స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంది. ఖర్చు చేయాలంటే అధికారులు కౌన్సిల్ ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఈ నిధుల విడుదలకు బడ్జెట్ సమావేశం నిర్వహించి కౌన్సిల్ ఆమోదం పొందాలి. ఈ నెలలో పక్కగా బడ్జెట్ సమావేశం కౌన్సిల్ సమావేశం జరిగితే గాని ఈ పనులు జరిగే అవకాశం లేదు.

ఈ నెలలోనే సమావేశం నిర్వహిస్తాం

ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ కోడ్ కారణంగా బడ్జెట్, సాధారణ సమావేశాలు నిలిచిపోయాయి. ఈ నెలలో బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశం.. మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహిస్తాం.

- సిహెచ్ వెంకటేశ్వర్లు,
మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

ఏకలవ్య పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏకలవ్య పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపిసి గ్రూపులో విద్యార్థులకు 11 సీట్లు, విద్యార్థినులకు 4 సీట్లు, బైపిసిలో బాలురకు 10 సీట్లు, బాలికలకు 2 సీట్లు, హెచ్‌ఇపి గ్రూపులో విద్యార్థినీ విద్యార్థులకు 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31లోగా పదో తరగతి మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు-2తో దరఖాస్తులను పాఠశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.



రబ్బర్‌డ్యామ్‌పై తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి-కొమరాడ

ఎస్‌పి ఆదేశాల మేరకు మండలంలోని ప్రముఖ ప్రదేశాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. గురువారం మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా డాగ్ స్క్వాడ్, బీడీ బృందాలతో ముమ్మరంగా గస్తీ కాస్తూ, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంసిఒ రామచంద్రుడు

మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు


ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా కన్సల్టెంట్ అధికారి రామచంద్రుడు వైద్య సిబ్బందికి సూచించారు. మొండెంఖల్‌లో జరుగుతున్న ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌ను గురువారం తనిఖీ చేశారు. స్ప్రే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.ప్రజ్ఞ, హెల్త్ సూపర్వైజర్లు భారతి, నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ జె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని ప్రభుత్వ భవనాలను గురువారం శ్రీకాకుళం జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా పరిశీలించారు. డిఎల్‌డిఒ కార్యాలయంతోపాటు డ్వామా ఎపిడి కార్యాలయం, డిఎల్‌పిఒ కార్యాలయం ఒకచోట ఉండేలా కసరత్తు చేయడంలో భాగంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. వెంకంపేటలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాన్ని పరిశీలించి ఎన్ని గదులు ఉన్నాయి? సరిపోతుందా? లేదా అనే వివరాలను సేకరించారు. ఆయనతోపాటు డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ ఉన్నారు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి దేవకుమార్

కోన సచివాలయంలో ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని కోన సచివాలయంలో కొత్తగా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఇఒపిఆర్‌డి దేవకుమార్ ప్రారంభించారు. ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుతో దబ్బగడ్డ, తూరుమామిడి, కోన, డి.శిర్లాం పంచాయతీల ప్రజలకు ఉపయోగకరమని ఆయన తెలిపారు.



వీధులను శుభ్రం చేస్తున్న కార్మికులు

పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల పరిధిలోని పెద్దూరు పంచాయతీలో పరిసరాల పరి శుభ్రతకు చర్యలు చేపడుతున్నారు. ప్రధానవీధితోపాటు ఆయా వీధులలో చెత్తాచెదారం రహదారిపై లేకుండా ఉండేలా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ మచ్చ నారాయణమ్మ, ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు తెలిపారు.

దేవనాపురంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దేవనాపురంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను సీతంపేట ఎస్ఐ వై.అమ్మన్నరావు గురువారం ప్రారంభించారు. ఇప్పటివరకు 50 టీములు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఉన్న యువతలో నైపుణ్యం వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెంట్ వేదిక అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిలు గురుమూర్తి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ వై.అమ్మన్నరావు

ముమ్మరంగా సమ్మె ప్రచారం



పాలకొండ.. సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు



సీతానగరం.. ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు రెడ్డి ఈశ్వరరావు

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జిల్లాలో గురువారం ముమ్మరంగా ప్రచారం చేశారు. సీతానగరం మండలంలో గుడ్డుపేట, లక్ష్మీపురం, బూర్జ, బల్లకృష్ణరాయపురం, బగ్గందొరవలస గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. ఉపాధి పని ప్రాంతాల్లో కూలీలతో సమావేశాలు నిర్వహించి, సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.రామారావు, ఎం.నాగరాజు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్.రాము, పి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎస్.అనురాధ, కొల్లి సాంబమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : సమ్మెను జయప్రదం చేయాలని బలిజిపేటలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కరపత్రాలు విడుదల చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి దాలమ్మ, సత్యవతి మాట్లాడారు.

గుమ్మలక్ష్మీపురం : సార్వత్రిక సమ్మె జయప్రదానికి భద్రగిరి అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రచారం చేపట్టారు. అనంతరం వివిధ రంగాల కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, కస్తూరి, సుధా, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కోరారు. పాలకొండలో సిఐటియు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.రాము, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.సత్యం, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి సిహెచ్ సంజీవి, ఇంజనీరింగ్ విభాగం కార్యదర్శి వై.హరిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి అర్థముడి లక్ష్మణరావు, శ్రీకోట దుర్గ మార్కెట్ కళాసీ యూనియన్ అధ్యక్షులు జాగా గోవిందరావు, కార్యదర్శి డి.గంగరాజు, ఉపాధ్యక్షులు డి.రాము, ఆటో యూనియన్ నాయకులు పి.శేఖర్, కె.రాము, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు, గిరిజన సంఘం నాయకులు ఎ.భానుచందర్రావు, రైతు సంఘం సీనియర్ నాయకులు కండాపు ప్రసాద్ రావు పాల్గొన్నారు

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమాప్రభ, కోశాధికారి బి.అమరవేణి, ప్రాజెక్టు నాయకులు జి.జెస్సిబాయ్, ఎస్.గంగమ్మ, కె.శారద పాల్గొన్నారు.



బలిజిపేట.. సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు



గుమ్మలక్ష్మీపురంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు



కొమరాడ.. సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

అవకాశాన్ని వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



వీరఘట్టం.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి-వీరఘట్టం

అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ... మహిళలకు సూచించారు. గురువారం మండలంలో నడుకూరు సమీపంలో కనోష ఆసుపత్రిలో బిసి కార్పొరేషన్ ద్వారా కుట్టుమిషన్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, ఎ.కుమారస్వామి, ఎల్.చంటి, జనసేన జానీ, ఆర్ రత్నాకర్, ఎస్ శశిభూషణరావు, కె.పైడిరాజు, ఎన్.కళ్యాణ్, ఎన్.శశికుమార్, ఎ.కృష్ణబాబు, బి.నీలకంఠంనాయుడు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలో కోర్టు ఎదురుగా ఉన్న ఖాళీ భవనంలో బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు, ఎంపిపి బొమ్మల భాను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, నాయకులు ఆకుల కుమార్, జయరాజు, కౌన్సిలర్ గంగనాయుడు, జనసేన నాయకులు కొండ దడి రాజేష్, జానీ, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. మండలంలోని చిట్టిపూడివలస గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు(69), ఎం.రాజపురం గ్రామానికి చెందిన కొప్పర రాము (54) మరణించారు. చిట్టిపూడివలస గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎం.రాజపురం గ్రామానికి చెందిన కొప్పర రాము గురువారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వస్తుండగా తెగిపడిన విద్యుత్తు తగిలి అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ జి.కళాధర్ ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. రాముకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సంజీవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామంలో గురువారం ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా అమ్మకాలపై దాడులు చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గరుగుబిల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు కారణంగా మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ బడే శ్రీనివాసనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గరుగుబిల్లి, గొట్టివలస, గొల్లవానివలస, తులసి రామినాయుడువలస మరుపెంట, దలాయివలస, బురదవెంకటాపురం, పెద్దూరు, చినగుడబ, పెదగుడబ, వల్లరిగుడబ, సన్యాసిరాజుపేట, కొత్తపల్లి, శివ్వాం, సీమలవానివలస, పోలినాయుడువలస, తదితర గ్రామాలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతానగరం : మండలంలో బూర్జ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ పి.శశిభూషణరావు తెలిపారు. బూర్జ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



తారురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రతి గ్రామానికీ పక్కా రహదారి

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని లక్కగూడ నుండి సదనుగూడ వరకు రూ.75 లక్షలతో నూతనంగా నిర్మించిన తారురోడ్డును ఆమె ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రోడ్లు అభివృద్ధి చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస అవసరాలు మెరుగు పడతాయని చెప్పారు. అనంతరం సదనుగూడ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, తెలుగు మహిళా నియోజకవర్గ కార్యదర్శి వెంపటాపు భారతి, ఎస్‌టి సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు రామారావు, ప్రసాద్, చిన్న, రాజేష్, మన్మథ, కొండలరావు, యువరాజ్, అప్పలస్వామి, భాస్కరరావు, ఎఇ అప్పారావు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పార్వతీపురం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పట్టణ, పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. పెదమరికి పంచాయతీ కొత్తఊరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు.